నేడు జిల్లా వ్యవసాయ, నీటి పారుదల సలహా మండలి సంయుక్త సమావేశం

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లా వ్యవసాయ సలహా మండలి, నీటిపారుదల సలహా మండలి సంయుక్త సమావేశం ఈనెల 8వ తేదీ శుక్రవారం సాయంత్రం 4 గంటలకు గోదావరి సమావేశ మందిరంలో నిర్వహించబడుతుందని ఏలూరు ఇరిగేషన్ సర్కిల్ పర్యవేక్షక ఇంజనీరు కె.శ్రీనివాస్ తెలిపారు. ఖరీఫ్ 2023-24(పసలి 1433) పంటకు సంబంధించి వర్షాభావ పరిస్థితులు అనుసరించి వ్యవసాయ పంటలకు నీటి లభ్యతపై జిల్లా కలెక్టర్ వారి ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు, నీటి పారుదల సలహా మండలి సభ్యులందరూ హాజరు కావాల్సిందిగా కోరారు.

8 నెలలు ఆగితే సమస్యలన్నీ పరిష్కరిస్తాం

పాలకొల్లు మండలం పెదమామిడిపల్లి వద్ద గీతకార్మికులతో లోకేష్

నరసాపురంలో శాశ్వత డంపింగ్‌యార్డు

లేసు పరిశ్రమకు రాయితీలు ఇచ్చి మార్కెట్ సౌకర్యం

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్

ప్రజాశక్తి - భీమవరం

'మరో 8 నెలలు వేచి ఉండండి, సమస్యలన్నీ పరిష్కరిస్తాను' అని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అన్నారు. వైసిపి ప్రజాప్రతినిధులకు అడ్డగోలు దోపిడీపై ఉన్న శ్రద్ధ ప్రజా సమస్యల పరిష్కారంపై లేదని విమర్శించారు. టిడిపి అధికారంలోకి రాగానే నరసాపురంలో శాశ్వత డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేసి గతంలో ప్రారంభించిన అభివృద్ధి పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. యువగళం పాదయాత్ర నరసాపురం నియోజకవర్గం సీతారామపురం క్యాంపు సైట్ నుంచి గురువారం ఉదయం తొమ్మిది గంటల ప్రాంతంలో ప్రారంభమైంది. నర్సాపురం పట్టణంలో యాత్రకు అపూర్వ స్వాగతం లభించింది. మాజీ ఎంఎల్ఎ బండారు మాధవనాయుడు, శాసనమండలి మాజీ ఛైర్మన్ ఎం.ఎ.షరీఫ్, నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు ఆధ్వర్యంలో లోకేష్‌ను గజమాలతో సత్కరించారు. నర్సాపురం జగన్నాథ ఆలయ సమీపంలో చేనేత కార్మికులు లోకేష్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. చేనేత కార్మికుల కుటుంబ సభ్యులకు గుర్తింపు కార్డులు మంజూరు చేసి, సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని, చేనేత వస్త్రాలపై 5 శాతం జిఎస్‌టి ఎత్తివేయాలని, జనతా వస్త్రాల పంపిణీ చేపట్టి చేనేత వస్త్రాలను కొనుగోలుచేయాలని, చేనేత కార్మికులకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందజేయాలని కోరారు. దీనిపై లోకేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో అసమర్థ పాలన కారణంగా చేనేతరంగం సంక్షోభంలో కూరుకుపోయిందని విమర్శించారు. జిఎస్‌టి రద్దు చేసేలా కేంద్రంతో మాట్లాడుతామని, కుదరకపోతే రాష్ట్ర ప్రభుత్వం భరించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. తొమ్మిదో వార్డు ప్రజలు లోకేష్‌ను కలిసి సమస్యలపై వినతిపత్రం అందించారు. మున్సిపాల్టీ ఏర్పడి 70 ఏళ్లయినా డంపింగ్ యార్డ్ లేదన్నారు. తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, ప్రభుత్వాసుపత్రిలో వైద్యుల కొరత కారణంగా వైద్యం అందట్లేదని చెప్పారు. లోకేష్ మాట్లాడుతూ చెత్తపై పన్నేసిన జగన్‌కు మౌలిక సదుపాయాల కల్పించడంపై దృష్టి లేదన్నారు. నర్సాపురంలో పేరొందిన లేస్ పరిశ్రమకు రాయితీలిచ్చి, మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. గాంధీ విగ్రహం వద్ద పట్టణ మహిళలు లోకేష్‌ను కలిసి సమస్యలు ఏకరువు పెట్టారు. ప్రతి ఇంటికీ కుళాయి ద్వారా రక్షితనీరు అందించాలని కోరారు. తూర్పుకాపులు సమస్యలపై వినతిపత్రం అందించారు. దీనిపై లోకేష్ స్పందిస్తూ తూర్పుకాపులను ఒబిసిలుగా గుర్తించే అంశంపై కేంద్రానికి లేఖ రాస్తానని, సర్టిఫికెట్ల సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. నర్సాపురం రైల్వేరోడ్డులో 30, 31వ వార్డు ప్రజలు లోకేష్‌ను కలిసి వినతిపత్రం అందించారు. రైల్వే ట్రాక్ దాటి వెళ్లేందుకు స్కూల్ పిల్లలు, రైతులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. ట్రాక్ దాటి వెళ్లేందుకు పుట్‌పాత్ బ్రిడ్జి లేదా అండర్ పాస్ రోడ్ ఏర్పాటు చేయాలని కోరారు. రైల్వేశాఖ అధికారులు, నర్సాపురం ఎంపీ రఘురామకృష్ణంరాజుతో మాట్లాడి అండర్ పాస్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటానని లోకేష్ హామీ ఇచ్చారు. సరిపల్లి భవన నిర్మాణ కార్మికులు లోకేష్‌కు సమస్యలు వివరించారు. సరిపల్లిలో వాటర్ సర్వీస్ సెంటర్ నిర్వాహకుడితో లోకేష్ మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గత ప్రభుత్వ హయాంలో విద్యుత్ బిల్లు రూ.1200 వచ్చేదని, ప్రస్తుతం రూ.4998 బిల్లు వచ్చిందని చెప్పారు. టిడిపి అధికారంలోకి వచ్చాక విద్యుత్ బిల్లులపై సమీక్షించి ఉపశమనం కలిగిస్తామని లోకేష్ చెప్పారు. అనంతరం పాదయాత్ర చించినాడ బైపాస్ గుండా కలగంపూడి చేరుకుంది.

నరసాపురం టౌన్: సీతారామపురం నుంచి ప్రారంభమైన యువగళం వేములదీవి ఛానల్ మీదుగా పట్టణంలోకి ప్రవేశించింది. అక్కడ రైతులు వేములదీవి ఛానల్ గురించి లోకేష్‌కు వివరించారు. ప్రభుత్వాసుపత్రి, మిషన్ హైస్కూల్ మీదుగా పంజా సెంటర్, మెయిన్ బజార్ మీదుగా హైవేకు చేరింది. ఈ యాత్రలో మాధవనాయుడు, ఎం.ఎ.షరీఫ్, పొత్తూరి రామరాజు, ఎన్ఆర్ఐ కొవ్వలి రామ్మోహన్‌నాయుడు, నేతలు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

పాలకొల్లు రూరల్: మండలంలోని సగం చెరువు వద్ద యువగళం పాదయాత్ర పాలకొల్లు నియోజకవర్గంలోకి ప్రవేశించింది. ఈ సందర్భంగా కొబ్బరి మొక్కలతో కూడిన గజమాల వేసి ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు లోకేష్‌కు స్వాగతం పలికారు. దిగమర్రు వద్ద బేడ బుడగ జంగాలు, పెదమామిడిపల్లి వద్ద గీత కార్మికులు తమ సమస్యలను లోకేష్‌కు విన్నవించారు.

యలమంచిలి: మండలంలోని కాజా గ్రామం వద్ద లోకేష్ పాదయాత్రకు మహిళలు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎంఆర్‌పిఎస్ నేతలతో లోకేష్ మాట్లాడారు. కలగంపూడి వద్ద ఢిల్లీ పబ్లిక్ స్కూల్ సమీపంలో రాత్రి బస చేశారు. ఈ కార్యక్రమంలో పాలకొల్లు ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు, మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్‌రావు పాల్గొన్నారు.

రెండేళ్లలో ఫిషింగ్ హార్బర్ నిర్మాణం

జిఒ నెం.217 రద్దు చేస్తాం: అగ్నికుల క్షత్రియుల ముఖాముఖిలో లోకేష్

ప్రజాశక్తి - భీమవరం

టిడిపి అధికారం చేపట్టిన రెండేళ్లలో నరసాపురంలో ఫిషింగ్ హార్బర్ నిర్మాణానికి కృషి చేస్తానని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ తెలిపారు. యువగళం పాదయాత్రలో భాగంగా నర్సాపురం నియోజకవర్గం చిట్టవరంలో గురువారం అగ్నికుల క్షత్రియులతో లోకేష్ ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా అగ్నికుల క్షత్రియులు పలు సమస్యలు లోకేష్ దృష్టికి తీసుకొచ్చారు. తీరప్రాంతాల్లో ఉండే తమ పిల్లలను చదివించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, గురుకుల పాఠశాల ఏర్పాటు చేయాలని కోరారు. తమకు ఎటువంటి రాజకీయ అవకాశాలూ లేవని, ఎంఎల్ఎ, ఎంఎల్‌సిలుగా అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. మినీ హార్బర్ నిర్మించాలని, అంతర్వేది ఆలయ ట్రస్టు, వాడపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయ ట్రస్టుల్లో అవకాశం కల్పించాలన్నారు. దీనిపై లోకేష్ మాట్లాడుతూ జగన్ నాలుగేళ్ల పాలనలో ఒక్క బోటూ ఇవ్వలేదని, పెట్రోల్, డీజిల్ సబ్సిడీలు లేవని విమర్శించారు. చెరువులను పెత్తందారులకు అప్పజెప్పేందుకు తీసుకొచ్చిన జిఒ 217ను తాము అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో రద్దు చేస్తామన్నారు. మెరుగైన పనిముట్లు అందిస్తామన్నారు. మత్స్యకారులను ఆర్థికంగా, రాజకీయంగా ముందుకు తీసుకెళ్తామన్నారు. బటన్ సంక్షేమం కాకుండా సంక్షేమం, అభివృద్ధిని జోడెద్దుల్లా పరుగులు పెట్టిస్తామని చెప్పారు. టిడిపి నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు మాట్లాడుతూ నియోజకవర్గంలో 35 వేల మంది అగ్నికుల క్షత్రియులు ఉన్నారని, వీరంతా పేదరికంలో ఉన్నారన్నారు. సమావేశంలో మాజీమంత్రి కొల్లు రవీంద్ర, అగ్నికుల క్షత్రియ సంక్షేమ సంఘం కన్వీనర్ కొప్పాడ రవి పాల్గొన్నారు.

అగ్నికుల క్షత్రియులతో ముఖాముఖిలో మాట్లాడుతున్న నారా లోకేష్

పాదయాత్రను అడ్డుకోవాలనుకోవడం సిగ్గుచేటు

ఉండి మాజీ ఎంఎల్ఎ శివ

ప్రజాశక్తి - ఉండి

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పాదయాత్రకు అడుగడుగునా అడ్డంకులు సృష్టిస్తూ అడ్డుకోవాలనుకోవడం సిగ్గుచేటని ఉండి మాజీ ఎంఎల్ఎ వేటుకూరి వెంకట శివరామరాజు విమర్శించారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. లోకేష్ పాదయాత్రకు వస్తున్న స్పందన చూసి తట్టుకోలేక వైసిపి నాయకులు ఇటువంటి ఘటనలకు పాల్పడ్డారని, ఇది సమంజసం కాదని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు వైసిపి తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

తణుకు: నారా లోకేష్ యువగళం పాదయాత్రను ఎవరూ అడ్డుకోలేరని మాజీ ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ స్పష్టం చేశారు. గురువారం తన నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ వైసిపి కవ్వింపు చర్యలను ఖండించారు. చంద్రబాబు, లోకేష్ గురించి మాట్లాడే అర్హత మంత్రి కారుమూరికి లేదన్నారు. నియోజవర్గంలో రైతులను ఏవిధంగా అవమానించారో ప్రజలు గమనిస్తున్నారన్నారు. భీమవరం ఘటనకు పోలీసుల వైఫల్యమే కారణమన్నారు.

యువగళం వాలంటీర్లకు రిమాండ్

మిగిలిన టిడిపి నేతలను త్వరలో అరెస్టు చేస్తాం: వన్‌టౌన్ సిఐ అడబాల శ్రీనివాస్

ప్రజాశక్తి - భీమవరం రూరల్

తాడేరు టౌన్‌షిప్ వద్ద వైసిపి, టిడిపి పరస్పర ఘర్షణకు సంబంధించి పోలీసులు అరెస్టు చేసిన 39 మంది యువగళం వాలంటీర్లకు జడ్జి 14 రోజులు రిమాండ్ విధించారని భీమవరం వన్‌టౌన్ సిఐ అడబాల శ్రీనివాస్ తెలిపారు. బుధవారం రాత్రి వీరిని రెండో అదనపు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ముందు హాజరుపర్చగా 14 రోజులు రిమాండ్ విధించారని, దీంతో వారిని రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించామని చెప్పారు. కేసులో ఉన్న మిగిలిన టిడిపి నేతలను కూడా త్వరలోనే అరెస్ట్ చేస్తామని తెలిపారు.

లోకేష్‌పై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

టిడిపి ఆందోళన

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్రపై తాడేరు టౌన్‌షిప్ వద్ద దాడి చేసిన వైసిపి నాయకులను వెంటనే అరెస్టు చేయాలని టిడిపి రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారథి డిమాండ్ చేశారు. గురువారం భీమవరం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ వద్ద కొద్దిసేపు టిడిపి నేతలు ఆందోళన నిర్వహించారు. అనంతరం సిఐ అడబాల శ్రీనివాసులును కలిసి లోకేష్‌పై దాడికి పాల్పడిన వారిని వదిలి టిడిపి నేతలు, యువగళం వాలంటీర్లపై అక్రమ కేసులు పెట్టి అరెస్టు చేయడం అన్యాయమని పార్థసారథి అన్నారు. టిడిపి నేతలు, పోలీసులపై దాడి చేసిన వైసిపి వారిని వెంటనే అరెస్టు చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వేంద్ర శ్రీనివాస్, జిల్లా లీగల్ సెల్ అధ్యక్షుడు నీలతి రమేష్, నాయకులు ఎద్దు ఏసుపాదం, ఎమ్‌డి.నౌషద్, గంటా త్రిమూర్తులు, పంతం వెంకటసతీష్, చెల్లబోయిన గోవింద్ పాల్గొన్నారు.

ఉండి మండలం చినపుల్లేరులో పసర్లతో నిండిన తాగునీటి చెరువు

కలుషిత నీరే దిక్కు..!

ఆక్వాతో కలుషితమైన నీటి వనరులు - కొనుగోలు చేస్తే తప్ప దాహం తీరని దుస్థితి

ప్రకటనలకే పరిమితమైన 'వాటర్‌గ్రిడ్' - రోగాల బారిన జనం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

రెండు జిల్లాల్లోనూ తాగునీటి కోసం జనం అత్యంత దుర్భర పరిస్థితి ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా డెల్టాలోని గ్రామాల్లో తాగేందుకు గుక్కెడు నీరు లేకుండాపోయింది. తాగునీటి చెరువులన్నీ పసర్లతో నిండి తాగేందుకు వీల్లేని దుస్థితి నెలకొంది. దీంతో జనం తాగునీరు కొనుగోలు చేస్తే తప్ప గొంతు తడవని పరిస్థితి ఏర్పడింది. ఆక్వా సాగుతో తాగునీటి వనరులన్నీ పూర్తిగా కలుషితమైపోయాయి. ఆక్వా చెరువుల్లో పురుగుమందులు, రకరకాల రసాయనాలు వాడిన నీటిని పంట కాలువల్లోకి నేరుగా విడిచిపెట్టేస్తున్నారు. ఆ నీటినే పంచాయతీ అధికారులు తాగునీటి చెరువుల్లో నింపుతున్నారు. ఆ నీరు తాగేందుకు వీల్లేకపోవడంతో జనం తాగునీటిని కొనుగోలు చేసుకోవాల్సిన దుస్థితి కొనసాగుతోంది. రెండు జిల్లాల్లోనూ దాదాపు 40 లక్షల జనాభా ఉన్నారు. దశాబ్దకాలంగా తాగునీటి కోసం రెండు జిల్లాల ప్రజలు పడుతున్న ఇబ్బందులు అన్నీఇన్నీ కావు. డెల్టా ప్రాంతంలోని నిడమర్రు, ఉండి, కాళ్ల, పాలకోడేరు వంటి అనేక మండలాల్లో తాగునీటి కోసం ప్రజలు నానావస్థలు పడుతున్నారు. 2014 ఎన్నికల్లో తాగునీటి అంశమే జిల్లాలో ప్రధాన ఎజెండాగా సాగింది. తాము అధికారంలోకి వస్తే 20 లీటర్ల నీటిని ఉచితంగా ఇస్తామని, ఎన్‌టిఆర్ సుజల స్రవంతి ద్వారా వాటర్‌ప్లాంట్లు ఏర్పాటు చేస్తామని టిడిపి హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చింది. ఉండి, ద్వారకాతిరుమల వంటి ఒకటి, రెండు చోట్ల మాత్రమే వాటర్‌ప్లాంట్లు ఏర్పాటు చేసి చేతులు దులుపుకుంది. అక్కడ కూడా సొమ్ము వెచ్చించి జనం తాగునీరు కొనుగోలు చేయాల్సి వచ్చింది. ఉచిత తాగునీటి హామీ ఎక్కడా అమలు కాలేదు. 2019 సాధారణ ఎన్నికల్లో మరోసారి తాగునీటి అంశం తెరపైకి వచ్చింది. వైసిపి అధ్యక్షుడు జగన్ జిల్లాలో పాదయాత్ర చేస్తూ తాగునీటిని బాటిళ్లలో చూపుతూ ఈ నీటిని మనుషులు తాగుతారా అంటూ అప్పటి ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. తాము అధికారంలోకి వస్తే వాటర్‌గ్రిడ్ ఏర్పాటు చేసి గోదావరి నుంచి పైప్‌లైన్ ద్వారా తాగునీటిని ప్రతి గ్రామానికీ అందిస్తామని హామీ ఇచ్చారు. అధికారంలోకొచ్చి నాలుగేళ్లయినా ఇప్పటికీ ఒక్క అడుగూ ముందుకు పడలేదు. ఇప్పటికీ జనం కలుషిత నీటినే తాగాల్సిన దుస్థితి నెలకొంది. తాగునీటి కొనుగోలు కోసం రోజుకు కనీసంగా రూ.20 వెచ్చించాల్సి వస్తోంది. నెలకు రూ.600కుపైగా తాగునీటికే సామాన్య ప్రజానీకం ఖర్చు చేస్తున్నారు. విచ్చలవిడిగా ఆక్వా చెరువులకు అనుమతులిచ్చిన ప్రభుత్వం, తాగునీరు అందించడంలో ఏమాత్రం శ్రద్ధ చూపడం లేదు. ప్రభుత్వాలు మారడం తప్ప జనాలకు దాహం తీరే పరిస్థితి మాత్రం లేకుండాపోయింది. డెల్టాలో ఏ గ్రామానికి వెళ్లినా తాగునీటి చెరువుల ద్వారా సరఫరా చేసే నీరు వాడకానికి తప్ప తాగేందుకు వీల్లేని పరిస్థితి ఉంది. కొన్ని గ్రామాల్లో వాడకానికి సైతం పనికిరాని పరిస్థితి ఉందంటే ఆశ్చర్యపోనక్కర్లేదు.

కాగితాలకే పరిమితమైన వాటర్‌గ్రిడ్

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రజలకు గోదావరి నుంచి తాగునీరు అందించేందుకు రూ.3200 కోట్లతో వాటర్‌గ్రిడ్ పథకం ఏర్పాటు చేయనున్నట్లు వైసిపి ప్రభుత్వం మొదట్లో ఊదరగొట్టింది. కొద్దికాలం తర్వాత వాటర్‌గ్రిడ్ పథకాన్ని డెల్టాకు మాత్రమే పరిమితం చేస్తున్నట్లు ప్రకటించి రూ.1400 కోట్లకు అంచనా వ్యయాన్ని కుదించారు. ఇది జరిగి ఏళ్లు గడిచిపోయాయి. ఇప్పటి వరకూ వాటర్‌గ్రిడ్ పథకానికి సంబంధించి ఒక్క అడుగూ ముందుకు పడలేదు. సర్వే పూర్తయిందంటూ మాటలు చెప్పడం తప్ప చేతలు మాత్రం లేకుండాపోయాయి. గత ఎన్నికల్లో వైసిపి జిల్లా ప్రజలకు ఇచ్చిన ప్రధానమైన హామీల్లో వాటర్‌గ్రిడ్ ఒకటి. ఇప్పటి వరకూ ఆ హామీ కార్యాచరణకు నోచుకోకపోవడంతో జిల్లావాసులు దాహార్తితో అల్లాడుతున్నారు. తాగునీటి కారణంగా డెల్టా ప్రజలు తీవ్ర అనారోగ్యం పాలవుతున్నారు. కొంతకాలంగా డెల్టాలో కేన్సర్, కిడ్నీ సమస్యలు పెద్దఎత్తున పెరుగుతున్నాయి. సురక్షిత తాగునీటి కోసం ప్రజల ఎదురుచూపులు ఎప్పటికి ఫలిస్తాయో అర్థం కాని పరిస్థితి నెలకొంది.

కృష్ణాష్టమి వేడుకల్లో అపశృతి

విద్యుదాఘాతంతో విద్యార్థి మృతి

ప్రజాశక్తి - ముదినేపల్లి

పాఠశాలలో నిర్వహించిన కృష్ణాష్టమి వేడుకల్లో అపశృతి నెలకొంది. కరెంట్ షాక్‌తో విద్యార్థి మృతి చెందిన సంఘటన గురువారం సాయంత్రం మండలంలోని కొత్తపల్లి ప్రగతి పబ్లిక్ హైస్కూల్‌లో చోటుచేసుకుంది. కృష్ణాజిల్లా మల్లపరాజుగూడెంకు చెందిన పాలడుగు సాత్విక్(15) ప్రగతి పబ్లిక్ హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్నాడు. గురువారం పాఠశాలలో కృష్ణాష్టమి వేడుకలను పాఠశాల యాజమాన్యం నిర్వహించింది. ఈ సందర్భంగా డిజె బాక్సులు, సౌండ్ సిస్టం పెట్టారు. దీంతో విద్యార్థులంతా ఆటా పాటలతో ఉల్లసంగా ఉత్సాహంగా గడిపారు. కార్యక్రమం ముగిసిన తర్వాత సాయంత్రం సౌండ్ సిస్టంకు అమర్చిన వైర్లను సాత్విక్ తీస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాకుకు గురైయ్యాడు. వెంటనే పాఠశాల యాజమాన్యం చికిత్సకై గుడివాడ తీసుకువెళ్లారు. పరిస్థితి విషమించడంతో విజయవాడ తరలిస్తుండగా సాత్విక్ మార్గమధ్యలో మృతిచెందాడు. పాఠశాల యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహారించడం వల్లే ఈ ప్రమాదం జరిగి సాత్విక్ ప్రాణం కోల్పోయాడంటూ స్థానికులు ఆరోపిస్తున్నారు. సాత్విక్ తల్లిదండ్రులు ఇద్దరు అదే పాఠశాలలో పని చేస్తున్నట్లు సమాచారం.

నేడు కొయ్యలగూడెంలో మినీ జాబ్‌మేళా

ఏలూరు/కొయ్యలగూడెం : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో కొయ్యలగూడెం ప్రకాశం డిగ్రీ కళాశాలలో ఈనెల 8వ తేదీ శుక్రవారం మినీజాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సమన్వయ అధికారి గంటా సుధాకర్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మినీజాబ్ మేళాలో ముత్తూట్ ఫైనాన్స్, టీమ్ లీడ్స్ కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారన్నారు. సుమారు 200 మంది నిరుద్యోగ యువతీ, యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. ఈ మినీజాబ్ మేళాకు పదవ తరగతి, ఇంటర్, ఐటిఐ, డిగ్రీ, పిజి వంటి విద్యార్హతలు ఉండి, 18-35 సంవత్సరాల వయస్సు గల వారు అర్హులని ఆయన తెలిపారు. వివరాలకు 9666322032, 9652503799, 9988853335 సంప్రదించాలన్నారు. ఈ జాబ్ మేళాకు అభ్యర్థులు తమ బయడేటా, సర్టిఫికెట్స్ నకలతో హాజరు కావాలని తెలియజేశారు.

మత్తుమందు వికటించి అపస్మారక స్థితిలోకి మహిళ

ఏలూరు స్పోర్ట్స్ : కంటి ఆపరేషన్ నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చేరిన మహిళకు ఆపరేషన్ చేసే ముందు మత్తు ఎక్కించడంతో అకస్మాత్తుగా ఆమె కూలబడిపోయింది. వెంటనే అక్కడ ఉన్న సిబ్బంది ఆమెను ఆసుపత్రి ఐసీయూలో చేర్పించారు. ప్రస్తుతం ఆమె వెంటిలేటర్‌పై ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడు తుంది. చింతలపూడి మండలం రేచర్ల గ్రామానికి చెందిన వరిగంటి మాణిక్యం(12) కంటి చూపు తగ్గడంతో చింతలపూడి ప్రభుత్వాసుపత్రికి వెళ్లారు. అక్కడ వైద్యులు పరీక్షించి కంటిలో శుక్లాలు ఉన్నాయని, ఏలూరు ఆసుపత్రికి వెళ్తే ఉచితంగా ఆపరేషన్ నిర్వహిస్తారని సూచించారు. చింతలపూడి పరిసర ప్రాంతాలకు చెందిన వారు కంటి ఆపరేషన్లు చేయించుకునే వారందరినీ ఈనెల 6వ తేదీన ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో ఉన్న కంటి విభాగానికి చెందిన మినీ బస్సులో మధ్యాహ్నానికి తీసుకువచ్చి, కంటి విభాగానికి చెందిన వార్డులో చేర్పించారు. గురువారం ఉదయం వైద్యులు ఆపరేషన్లు ప్రారంభించారు. నలుగురికి ఆపరేషన్లు పూరైన తరువాత ఐదవ ఆపరేషన్‌గా వరిగంటి మాణిక్యానికి అక్కడ ఉన్న కంటి విభాగపు సిబ్బంది ఆపరేషన్ థియేటర్‌లో మత్తు ఇచ్చారు. ఆ మత్తు వికటించి ఆమె పడిపోయారు. వెంటనే ఆమెను తీసుకువచ్చి ఆసుపత్రి ఐసీయూలో ఉదయం చేర్పించారు. ఆమె అపస్మారక స్థితిలోకి చేరింది. ఆసుపత్రి ఐసీయూ విభాగపు వైద్యులు ఆమెకు వైద్య సేవలు అందిస్తున్నారు. అయితే ఆమె ప్రాణాపాయ స్థితిలో ఉందని వైద్యులు వెల్లడించారు. ఈ విషయం తెలుసుకున్న ఆమె బంధువులు, కుటుంబ సభ్యులు ఐసీయూలో ఆందోళన చేపట్టడంతో సమాచారం అందుకున్న ఏలూరు 2-టౌన్ పోలీసులు అక్కడకు చేరుకుని రోగులకు ఇబ్బంది కల్గించవద్దని, ఏదైనా ఉంటే ఫిర్యాదు చేయాలని సూచించి, వారితో చర్చించి బయటకు తీసుకువచ్చారు. ప్రస్తుతం మాణిక్యం ఐసీయూలో వెంటిలేటర్‌పై కొట్టుమిట్టాడుతుంది.

అత్యంత పకడ్బందీగా పోలింగ్ కేంద్రాల పునర్విభజన

పారదర్శకంగా ఇంటింటా పరిశీలన పూర్తి : కలెక్టర్

ప్రజాశక్తి - ఏలూరు

స్పెషల్ సమ్మర్ రివిజన్ 2024లో భాగంగా చేపట్టిన ఇంటింటి పరిశీలన, పునఃపరిశీలన కార్యక్రమం పూరైందని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ తెలిపారు. గురువారం స్థానిక కలెక్టరేట్ గౌతమి సమావేశ మందిరంలో ఓటర్ల జాబితా వారీగా పోలింగ్ కేంద్రాలు పునర్విభజన, ఎస్ఎస్ఆర్ 2024 అంశాలపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమీషన్ నిబంధనల మేరకు ఓటర్ల జాబితా నుంచి తొలగించిన ఓటర్ల పేర్లను పునఃపరిశీలన, విచారణ ప్రక్రియ కూడా పూరైందన్నారు. ఎన్నికల కమీషన్ ఆదేశాలతో పక్కాగా మరోసారి పరిశీలన, క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టామన్నారు. మృతులు, శాశ్వత వలసలు, ఇతర కారణాలతో నిబంధనల ప్రకారమే ఓటర్ల జాబితా నుంచి ఓటర్లను తొలగించిన విషయాన్ని రాజకీయ పార్టీల నాయకులకు ఆయన వివరించారు. సంక్షిప్త ఓటర్ల జాబితా ప్రక్రియ అత్యంత పారదర్శకతతో నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాలోని ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు(ఇఆర్ఒ)లు, అదనపు ఎఇఆర్‌ఒలు వారి పరిధిలోని ప్రతిఒక్క తొలగింపు పరిశీలన చేశారన్నారు. గత ఏడాదిన్నర కాలంలో సుమారు 70 వేల వరకూ మరణించిన వారి ఓట్లను తొలగించామన్నారు. క్షేత్రస్థాయిలో పొరపాట్లు, సమస్యలు ఉంటే లిఖితపూర్వకంగా సెప్టెంబరు 15 లోగా రాజకీయ పక్షాల నాయకులు తమ దృష్టికి తీసుకురావచ్చన్నారు. అర్హులైన ఓటర్ల నమోదుకు సంబంధించి ఎక్కువ సంఖ్యలో దరఖాస్తులు ఇవ్వకూడదని, 5 దరఖాస్తుల వరకూ అనుమతించబడతాయన్నారు. ఓటర్ల జాబితాల వారీగా పోలింగ్ కేంద్రాలు పునర్విభజన ప్రక్రియ అత్యంత పకడ్బందీగా చేయాల్సిన అవసరం ఉందని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రస్తుతం జిల్లాలో 1736 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. పోలింగ్ కేంద్రాల పునర్విభజన, పోలింగ్ కేంద్రాల భవనాల మార్పు, పేరు మార్పుకు సంబంధించి రాజకీయ పక్షాల ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేసి సంబంధిత ప్రతిపాదనలు ఎన్నికల కమీషన్‌కు పంపిస్తామన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎవిఎస్ఎస్ మూర్తి, కలెక్టరేట్ ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ చల్లన్న దొర, రాజకీయ పార్టీల ప్రతినిధులు నెరుసు నెలరాజు(బిజెపి), యం.శిర్రా భరత్ రావు(బిఎస్‌పి), కలవకొల్లు సాంబ(వైసిపి), పాలిప్రసాద్(టిడిపి), ఇఆర్‌ఒలు కె.పెంచల్ కిశోర్, డా.జాన్సీ రాణి, జి.సత్యనారాయణ, సూర్యనారాయ రెడ్డి, బాబ్జి, ఎఇఆర్‌ఒ సోమశేఖర్ పాల్గొన్నారు.

రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

తొలగించబడిన ఓటర్ల జాబితాను ర్యాండమ్‌గా తనిఖీ చేసిన కలెక్టర్

ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా జిల్లాలోని 7 నియోజకవర్గాలకు చెందిన ఓటర్ల జాబితాకు సంబంధించిన రిజిష్టర్లను, కంప్యూటర్ డేటాను జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ పరిశీలించారు. గురువారం ఓటర్ల సవరణ ప్రక్రియలో ఖచ్చితత్వాన్ని పరిశీలించేందుకు జిల్లాలోని 7 నియోజవకవర్గాల ఇఆర్‌ఒ, ఎఇఆర్‌ఒ, సంబంధిత బిఎల్‌ఒలతో జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ర్యాండమ్ చెక్‌ను నిర్వహించారు. ఎన్నికల కమీషన్ నియమనిబంధనలు అనుసరించి ఓటర్ల సవరణ ప్రక్రియ జరిగిందీ, లేనిదీ ఆయన పరిశీలించారు.

ప్రకాశం చౌక్‌లో టంగుటూరు విగ్రహం ఏర్పాటుకు కృషి

శాసనమండలి ఛైర్మన్ మోషేన్‌రాజు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ప్రకాశం చౌక్ నామకరణం చేసి ప్రకాశం పంతులు విగ్రహం లేకపోవడం శోచనీయమని, ఆ ప్రాంతంలో విగ్రహాన్ని నెలకొల్పేందుకు అందరి సహకారంతో కృషి చేస్తానని శాసన మండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు అన్నారు. ప్రకాశం చౌక్‌లో విగ్రహాన్ని నెలకొల్పాలని విగ్రహ కమిటీ సభ్యులు గురువారం మోషేన్‌రాజుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల, మత, రాజకీయాలకు అతీతంగా అందరూ సహకరించాలన్నారు. ఈ విషయంపై విగ్రహ కమిటీ సభ్యులు ఎప్పటినుంచో కోరుతున్నారని, ప్రకాశం పంతులు విగ్రహ స్థాపనకు సంపూర్ణంగా సహకరిస్తానని చెప్పారు. వినతిపత్రం అందించిన కమిటీ సభ్యులు చెరుకువాడ రంగసాయి, కంతేటి వెంకటరాజు, అరసవల్లి సుబ్రహ్మణ్యం, నందమూరి రాజేష్, భట్టిప్రోలు శ్రీనివాసరావు మాట్లాడుతూ దీనికి సంబంధించి ఎంతోమంది దాతలు సిద్ధంగా ఉన్నారని, 25 ఏళ్లుగా విగ్రహం ఏర్పాటు చేయాలని ప్రజా ప్రతినిధులను కోరామని తెలిపారు. త్వరలోనే విగ్రహం ఏర్పాటు చేసుకుంటామని ఆశాభావం వ్యక్తం చేస్తున్నామన్నారు. వాసర్ల ముత్యాలరావు పాల్గొన్నారు.

ఇంటర్ ఫెయిలైన విద్యార్థులకు మరో అవకాశం

నెలాఖరులోగా సబ్జెక్టుల వారీగా ఫీజు చెల్లించొచ్చు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

గతంలో ఇంటర్‌మీడియట్ మొదటి, ద్వితీయ సంవత్సరం చదివి ఫెయిలైన విద్యార్థులకు రాబోవు మార్చి 2024 ఇంటర్‌మీడియట్ పబ్లిక్ పరీక్షలు రాసేందుకు ప్రభుత్వం మరో అవకాశం కల్పించిందని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ బి.సతీష్ కుమార్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కావున గతంలో ఇంటర్‌మీడియట్ చదివి ఏవైనా సబ్జెక్టులు ఫెయిలైన విద్యార్థులు సెప్టెంబర్ 30వ తేదీలోగా ఫీజు చెల్లించాని తెలిపారు. ఏ సబ్జెక్ట్‌లు అయితే ఫెయిల్ అయ్యారో ఆ సబ్జెక్టులకు సంబంధించి ఫీజులను కళాశాలలో చెల్లించి, పబ్లిక్ పరీక్షలు రాసుకోవచ్చని ఆయన తెలిపారు.

వర్షం కారణంగా ఆటల పోటీలు వాయిదా

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

మండలంలోని పల్లెర్లమూడి జడ్‌పి హైస్కూల్లో నిర్వహించాల్సిన మండలస్థాయి ఆటల పోటీలు వర్షం కారణంగా వాయిదా వేసినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు హనుమంతరావు వెల్లడించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఆయన గురువారం మాట్లాడుతూ ఈనెల 7న ప్రారంభం కావాల్సిన ఆటల పోటీలు వర్షం కారణంగా సోమవారానికి వాయిదా పడినట్లు తెలిపారు. ఈనెల 8వ తేదీన నిర్వహించాల్సిన బాలికల పోటీలు వాతావరణం అనుకూలిస్తే యధావిధిగా కొనసాగుతాయని తెలియజేశారు.

ఉపాధ్యాయుడు గోపాల్‌కు నగదు అందజేస్తున్న పాఠశాల సిబ్బంది

గురుభక్తిని చాటిన పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి - కలిదిండి

తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువు 62 ఏళ్ల వయస్సులో పలు ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నట్టు తెలుసుకున్న పూర్వ విద్యార్థులు చలించిపోయారు. రూ.70 వేల ఆర్థికసాయం అందజేసి, తమ గురుభక్తిని చాటుకున్నారు. కోరుకొల్లు క్రాంతి హైస్కూల్‌లో నాడు చదువు చెప్పిన ఉపాధ్యాయుడు ఎస్‌వి గోపాల్‌కు ఆ నగదును గురుదక్షణగా అందజేసినట్లు కరెస్పాండెంట్ చన్నంశెట్టి కృష్ణ తెలిపారు. పూర్వ విద్యార్థుల సాయంతో పాటు ప్రస్తుత సిబ్బంది, పాఠశాల యాజమాన్యం సాయం అందించడంలో సహకరించారన్నారు. కోరుకొల్లులోని ఉపాధ్యాయుడు ఎస్‌వి గోపాల్ స్వగృహంలో చన్నంశెట్టి కృష్ణ, లక్ష్మి దంపతులు, పాఠశాల సిబ్బంది నగదుని అందజేశారు.

నేడు ప్రత్యేక కమిటీ గురజ రాక

ముదినేపల్లి : మండలంలోని గురజ ఎస్‌టి కాలనీ వాసులకు (కొండదొర) దశాబ్దాల కాలం నుంచి కుల ధ్రువపత్రాలు అధికారులు మంజూరు చేయకపోవడంతో ఎస్‌టి కాలనీ వాసులు ఇటీవల మండల తహశీల్దార్ కార్యాలయం, అలాగే ఈనెల 4వ తేదిన జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. 70 ఏళ్లుగా తాము గురజలో జీవిస్తున్నామని, తమకు ఎస్‌టి కుల ధ్రువపత్రాలు అధికారులు ఇవ్వకపోవడంతో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. కులధ్రువపత్రాలు అధికారులు ఇవ్వకపోవడంతో తాము ఎస్‌టి రిజర్వేషన్లకు, ప్రభుత్వ రాయితీలకు దూరమవుతున్నామంటూ స్పందనలో జిల్లా కలెక్టర్‌కు అర్జీలు అందజేశారు. ఈ అర్జీపై స్పందించిన జిల్లా కలెక్టర్ ఒక ప్రత్యేక కమిటీని విచారణ నిమిత్తం ఏర్పాటు చేశారు. ఈకమిటీ గురజలో ఈనెల 8వ తేది శుక్రవారం మధ్నాహ్నం ఎస్‌టి కాలనీ సదర్శించి విచారణ చేయనుంది. ఈ విచారణకు ఎస్‌టి కాలనీవాసులు అంతా తప్పక హాజరు కావాలంటూ తహాశీల్దార్ కె.శ్రీనివాస్ గురువారం తెలిపారు.

ఉచిత కుట్టు మిషన్ శిక్షణా కేంద్రం ప్రారంభం

టి.నరసాపురం : మండలంలోని తిరుమలదేవిపేటలో తపన ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు మిషను శిక్షణా కేంద్రాన్ని మధ్యాహ్నపువారిగూడెం సొసైటీ ఛైర్‌పర్సన్ దాసరి రాంబాబు చేతుల మీదుగా గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తపన ఫౌండేషన్ ద్వారా అందిస్తున్న కుట్టుమిషన్ శిక్షణా కేంద్రాన్ని మహిళలు వినియోగించుకోవాలన్నారు. 90 రోజుల పాటు జరిగే ఈ శిక్షణ గ్రామీణ ప్రాంత మహిళలకు దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తపన ఫౌండేషన్ వాలంటీర్ శ్యామ్ సుందర్, దాకారపు సూరిబాబు, రెడ్డెం రమాదేవి, ఎం.హరిబాబు, కాంచనమాల, దామిశెట్టి కేశవరావు, తోట రామారావు పాల్గొన్నారు.

కొనసాగుతున్న జిల్లాస్థాయి శిక్షణా తరగతులు

భీమడోలు : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమగ్ర గ్రామీణాభివృద్ధి అంశంపై గ్రామపంచాయతీ కార్యదర్శులకు జిల్లాస్థాయిలో శిక్షణా కార్యక్రమాలు ఏలూరులో కొనసాగుతున్నాయని డిఎల్‌పిఒ పూర్ణచంద్ర శేఖర్ తెలిపారు. శిక్షణా తరగతుల్లో పాల్గొన్న రెండవ బ్యాచ్‌కి చెందిన గ్రామపంచాయతీ కార్యదర్శులకు, మండలంలోని కోడూరుపాడులో పూర్తైన స్వమిత్వ సర్వే వివరాల క్షేత్రస్థాయి పరిశీలనకు గురువారం కోడూరుపాడు వచ్చారని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభకు సర్పంచి ఎం.నాగేశ్వరరావు అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా డిఎల్‌పిఒ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి వెంకట్రావు, ఎంపిడిఒ సిహెచ్ పద్మావతి దేవి, ఇంఛార్జి పంచాయతీ విస్తరణ అధికారి ముత్తయ్య, స్వమిత్వ సర్వే కోడూరుపాడు సమన్వయకర్త నిఖిల్ పాల్గొన్నారు.

చిన్నవారిగూడెంలో క్షుద్ర పూజలు కలకలం

జంగారెడ్డిగూడెం : మండలంలోని చిన్నవారిగూడెంలో క్షుద్ర పూజలు కలకలం రేపాయి. గురువారం ఉదయం చిన్నవారి గూడెంకు చెందిన బండారు వెంకట సుబ్బారావు ఇంటి ముందు క్షుద్రపూజలు నిర్వహించిన గుర్తులను స్థానికులు గమనించారు. పసుపు, కుంకుమ, నల్ల బొగ్గులు, నిమ్మకాయలుతో క్షుద్ర పూజలు జరిపినట్లు స్థానికులు భావిస్తున్నారు. అలాగే ఆకతాయిలు ఎవరైనా ఇలా చేసి ఉండవచ్చని అనుమానాలు కూడా వ్యక్తం అవుతున్నాయి. ఇలాంటివి జరగకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

వేగం కన్నా ప్రాణం మిన్నా : సిఐ

కైకలూరు : రహదారులపై ప్రయాణిస్తున్న వారు వేగం కంటే ప్రాణం విలువైనదని గమనించాలని సిఐ ఆకుల రఘు తెలిపారు. గురువారం ఎస్‌పి మేరీ ప్రశాంతి, డిఎస్‌పి శ్రీనివాసులు ఆదేశాల మేరకు రహదారి ప్రమాదాలు నివారణకు ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వాహనదారులు హెల్మెట్ తప్పకుండా ధరించాలని ఈ సందర్భంగా తెలియజేశారు. ట్రాఫిక్ నియమ నిబంధనలు విద్యార్థి దశ నుంచే అవగాహన చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టౌన్ ఎస్‌ఐ ప్రతాపరెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కాకరతోట పరిశీలన

ఆగిరిపల్లి : కాకరతోటల్లో రసం పీల్చు పురుగు ఉధృతి ఎక్కువుగా వుందని, దీంతో ఆకుముడత వచ్చి పందిరి అల్లుకోకుండా, దిగుబడి తగ్గే ప్రమాదం వుందని ఆగిరిపల్లి ఉద్యానశాఖాధికారిణి కె.జ్యోతి ప్రియాంక తెలిపారు. గురువారం ఆమె కనసానపల్లిలోని కాకరతోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె రసం పీల్చు పురుగు నివారణ కోసం పంట వేసిన 15రోజులకు పుసుపు, బ్లూరంగు, తెల్లరంగు అట్టలను ఎకరానికి 12-15 చొప్పున అమర్చాలని, ఇంకా పురుగు తీవ్రత ఎక్కువుగా వుంటే ప్రిపోనిల్ 2 మి.లీలు ఒక లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో విలేజ్ హార్టీకల్చర్ అసిస్టెంట్ పి.రమేష్, రైతులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు రుణాలు ఇప్పించాలి

పోలవరం : గ్రామంలోని కౌలు రైతులకు రుణాలు ఇప్పించాలని ఎస్‌బిఐ మేనేజర్ నవీన్ కుమార్‌ను కోరినట్లు పోలవరం మండల వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ దత్తి రాంబాబు, మండల వ్యవసాయాధికారి కె.రాంబాబు తెలిపారు. మండలంలో కౌలురైతులు సాగు చేస్తున్న రైతులకు ఖరీఫ్ 2023 సీజన్‌కి సంబంధించి వ్యవసాయ పెట్టుబడులకు రుణాలు ఇప్పించాల్సిందిగా ఎస్‌బిఐ బ్యాంక్ మేనేజర్‌ని కోరామన్నారు. మేనేజర్ నవీన్ కుమార్ మాట్లాడుతూ రుణాలు కావాల్సిన రైతులు సిసిఆర్‌సి కార్డు తీసుకుని బ్రాంచ్‌లో తమను సంప్రదించవచ్చని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతులు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

మద్యానికి డబ్బులు ఇవ్వలేదని కర్రతో దాడి

నూజివీడు రూరల్ : పట్టణంలో మద్యానికి బానిసైన వ్యక్తి మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వలేదని సొంత సోదరిపై కర్రతో దాడి చేసిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. తిరువూరు బస్టాండ్ సమీపంలో నివసిస్తున్న గృహిణి లక్ష్మి(32) తన సోదరుడైన రమేష్‌కు మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వలేదని కోపంతో కర్రతో దాడి చేశాడు. గాయాలపాలైన లక్ష్మి నూజివీడు ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

నిల్వ మాంసం విక్రయిస్తే చర్యలు

జంగారెడ్డిగూడెం : ప్రజలకు అనారోగ్యం కలిగించే నిల్వ మాంసాన్ని విక్రయించే వారిపై చర్యలు తీసుకుంటామని స్థానిక ఎస్‌ఐ సాగర్‌బాబు హెచ్చరించారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదురుగా ఉన్న మాంసం దుకాణాలలో తనిఖీలు చేశారు. ఈ క్రమంలో ఓ దుకాణంలో నిల్వ ఉంచిన మాంసాన్ని పోలీసులు గుర్తించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ సాగర్ బాబు మాట్లాడుతూ మాంసం కొనేటప్పుడు ప్రజలు జాగ్రత్తగా పరిశీలించి కొనుగోలు చేయాలని సూచించారు. నిల్వ మాంసం తినడం వల్ల ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నట్లు ఎస్‌ఐ సాగర్ బాబు తెలియజేశారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

శిథిలావస్థలో ఎఇ సెక్షన్ కార్యాలయం

భయాందోళనలో సిబ్బంది, ప్రజలు

ప్రజాశక్తి - చింతలపూడి

ఆ భవన నిర్మాణం చేపట్టి ఇంచుమించు 40 నుంచి 50 సంవత్సరాలు అవుతుంది. పైస్లాబ్ నుంచి పెచ్చులు ఎప్పుడు ఊడిపడతాయో తెలియదు. ఆ కార్యాలయంలోకి వెళ్లాలంటేనే భయపడే పరిస్థితి నెలకొంది. ఆ కార్యాలయమే చింతలపూడి ఎఇ సెక్షన్ కార్యాలయం..

చింతలపూడి మండలంలోని ఎఇ సెక్షన్ కార్యాలయం ఇప్పుడు శిథిలావస్థకు చేరుకుంది. మెట్ట ప్రాంతమైన చింతలపూడిలో ఎఇ సెక్షన్ కార్యాలయంలోకి రోజూ వందల మంది రైతులు ఏదో పని మీద వస్తుంటారు. భవనం పరిస్థితి చూసి ఎఇ వద్దకు వెళ్లాలంటే



పెచ్చులూడి ఐరన్ ఊసలు కనబడుతున్న స్లాబ్

చింతలపూడిలోని ఎఇ కార్యాలయం
పెచ్చులూడుతున్న స్లాబ్..

ఆలోచిస్తున్నారంటే.. అర్థం చేసుకోవచ్చు పరిస్థితి ఏవిధంగా ఉందో..!

ఈ మధ్యకాలంలోనే రైతులతో లైన్‌మెన్ మాట్లాడుతుండగా పైనుంచి పెద్ద శబ్దంతో పెచ్చులు ఊడి పడ్డాయి. పక్కకు వెళ్లిపోవడంతో ఎవరికీ ఎటువంటి గాయాలు అవ్వలేదు. పెచ్చులు ఊడిపోయి ఐరన్ కనబడుతోంది. భవనం పరిస్థితి ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియని పరిస్థితిలో ఉంది. అంతే కాకుండా సెక్షన్ కార్యాలయం చుట్టూ ప్రహరీ లేకపోవడంతో విద్యుత్ పరికరాలు అపహరించడానికి ఆస్కారం ఉంది. కార్యాలయానికి వచ్చినట్లు వచ్చి సామాన్లు పట్టుకుపోవడానికి ప్రయత్నాలు చేస్తున్నారని అధికారులు చెబుతున్నారు. ప్రహరీ గేట్లు లేకపోవడంతో సామాన్లు అపహరణకు గురయ్యే అవకాశాలు మెండుగా ఉన్నాయి. వర్షం వస్తే స్లాబ్ మీద వర్షపు నీరు నిలిచిపోయి, పెచ్చులు ఊడిపోయి, ఇనుపకడ్డీలు బయటకు కనిపిస్తున్నాయి. గోడలు చెమ్మకి చిత్తడిగా మారుతున్నాయి. గట్టిగా వర్షాలు పడితే ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి. పెచ్చులూడుతున్న శిథిల భవనంలోనే సిబ్బంది భయాందోళనతో విధులు నిర్వహిస్తున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం వాటిల్లుతుందోనని ఆందోళన చెందుతున్నారు.

త్వరలో నూతన భవన నిర్మాణం..

రాంబాబు నాయక్, విద్యుత్ శాఖ, ఎడి

నూతన భవన నిర్మాణం కోసం ప్రణాళికలు సిద్ధం చేశారు. త్వరలో నూతన భవన నిర్మాణం చేపడతారు.

ఐటిఐలో ప్రవేశానికి ఆన్‌లైన్ అడ్మిషన్లు

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

పట్టణంలోని ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి ఆన్‌లైన్ అడ్మిషన్‌లను నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ దేవరకొండ భూషణం గురువారం తెలియజేశారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఈనెల 19వ తేదీ సాయంత్రం ఐదు గంటల లోపు కళాశాల వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈనెల 20వ తేదీ లోపు ఒరిజినల్ సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి చేసుకోవాలని, 22వ తేదీన నిర్వహించే కౌన్సెలింగ్‌కు హాజరవ్వాలని ఆయన తెలిపారు.

దంత సమస్యలపై అవగాహన

ఏలూరు అర్బన్ : స్థానిక కోటదిబ్బ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం స్టార్ డెంటల్ హాస్పిటల్, ఏలూరు హేలాపురి లయన్స్ క్లబ్ వారి సంయుక్త ఆధ్వర్యంలో కళాశాల విద్యార్థులకు, అధ్యాపకులకు 'ఉచిత దంత వైద్య శిబిరం' ఏర్పాటు చేశారు. ముందుగా అవగాహనా సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ గుత్తా గిరిబాబు అధ్యక్షత వహించి మాట్లాడుతూ విద్యార్థులు అనారోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయకూడదన్నారు. అనంతరం డాక్టర్ ఎస్.శ్రీహర్ష వివిధ కారణాలతో వచ్చే దంత సమస్యలను గురించి వివరించారు. తర్వాత డాక్టర్ ఎవి.సిందూజ పళ్లను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన ఆవశ్యకతను, వివిధ పళ్ల సమస్యలకు పరిష్కార మార్గాలను సూచించారు. అనంతరం విద్యార్థులకు, అధ్యాపకులకు పరీక్షలు నిర్వహించి చికిత్సలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రెసిడెంట్ కెబి.రావు, కార్యదర్శి బివివి.సత్యనారాయణ, ప్రోగ్రామ్ కన్వీనర్ వి.వెంకటేశ్వరావు, సభ్యులు శ్రీహరికోట పాల్గొన్నారు.

మస్కులర్ డిస్ట్రోఫీపై అవగాహన

ఏలూరు టౌన్ : ఏలూరు దొండపాడులోని ఉమా ఎడ్యుకేషనల్ టెక్నికల్ సొసైటీ ఆధ్వర్యంలో జిల్లా వికలాంగుల పునరావాస కేంద్రం వారు జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో వరల్డ్ మస్కులర్ డిస్ట్రోఫి డే సందర్భంగా అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టి.త్రివిక్రమ్ మోహన్, డ్యూటీ డాక్టర్ మణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా త్రివిక్రమ్ మోహన్ మాట్లాడుతూ మస్కులర్ డిస్ట్రోఫి జన్యుపరమైన వ్యాధి, ఇది తల్లిదండ్రుల ద్వారా ప్రధానంగా సంక్రమిస్తుందని తెలిపారు. ఈ వ్యాధికి మందులు లేవన్నారు. సంస్థ కోఆర్డినేటర్ డి.శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ ఫిజియో థెరపీ ద్వార వ్యాధి తీవ్రతను తగ్గించవచ్చునని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వికలాంగులకు అవసరమైన కృతిమ అవయవాలు, పిజియో థెరఫి, అడియోలజి, స్పీచ్ థెరఫి మొదలగు సేవలను ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వికలాంగుల పునరావాసకేంద్రం సిబ్బంది, వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.

డ్రెయినేజీ సమస్యను పరిష్కరించాలి : సిపిఎం

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

డ్రెయినేజీ సమస్యను పరిష్కరించాలని సిపిఎం మండల కార్యదర్శి శుక్లబోయిన రాంబాబు తెలిపారు. మండలంలోని పరింపూడి పంచాయతీ వాటర్ ట్యాంకు రామాలయం రోడ్డులోని డ్రెయినేజీ చెత్తతో పూడుకుపోయి అధ్వానంగా తయారైంది. రోడ్డు మీదకు డ్రెయినేజీ నీరు చేరడంతో ఆ వార్డులోని ప్రజలు ఈ

చెత్తాచెదారంతో నిండువున్న డ్రెయినేజీను చూపిస్తున్న రాంబాబు

నీటిలోంచే నడుచుకుంటూ వెళుతున్నారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి శుక్లబోయిన రాంబాబు మాట్లాడుతూ అనారోగ్య పరిస్థితులు, దోమలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పంచాయతీ అధికారులు, పైఅధికారులు డ్రెయినేజీ సమస్యను పరిష్కరించకపోతే ఆ వార్డు జనంతో పోరాటం చేస్తామని హెచ్చరించారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయులను సత్కరిస్తున్న ఫౌండేషన్ సభ్యులు

ప్రజాశక్తి - టి.నరసాపురం

మండలంలోని కృష్ణాపురంలో ఎంపిపి పాఠశాల ప్రధానోపాధ్యాయులు గణేష్ మండల ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎంపికైన సందర్భంగా భుక్యా గోపయ్య సక్రమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు ఎస్‌కె మెహుద్దిన్‌ను గురువారం టి.నరసాపురంలో ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయున్ని పూలమాలలు, శాలువాతో సత్కరించారు. అదేవిధంగా భూక్యా శ్రీనివాస్, జరబాల బాలాజీ దాతల సహకారంతో ఫౌండేషన్ వ్యవస్థాపకులు భూక్యా వేణుగోపాల్ ఆధ్వర్యంలో 130 మంది విద్యార్థులకు భోజనం ప్లేట్లు పంపిణీ చేశారు. విద్యార్థులను బావి భారత పౌరులుగా తీర్చిదిద్దే ఉపాధ్యాయుల సేవలు అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో దేశావత్ వెంకట్, భుక్యా సత్తిబాబు, కృష్ణ పాల్గొన్నారు.

భీమడోలు : అవార్డులు ఉపాధ్యాయుల బాధ్యతలను మరింతగా పెంచుతాయని, దానికి అనుగుణంగా ఉపాధ్యాయులు పని చేయాలని దుద్దేపూడి గ్రామ సర్పంచి నీలం శ్రీనివాసరావు, ఎంపిటిసి ఎన్.శ్రీనివాసరావుతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు కోరారు. అన్నేవారి గూడెం ఎంపిపి ప్రాథమికోన్నత పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు షేక్ మస్తాన్ జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా, తెలుగు ఉపాధ్యాయురాలు దుర్గా ప్రసాదిని మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయురాలుగా ఎంపికయ్యారు. ఈ నేపథ్యంలో గురువారం గ్రామస్తులు, విద్యార్థులు, స్థానిక ప్రజాప్రతినిధులు వీరిని సత్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఉపాధ్యాయుల వేషధారణలతో విద్యార్థులు ప్రదర్శించిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

స్థానిక చత్రపతి శివాజీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గురువారం స్థానిక చత్రపతి శివాజీ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డా.ఎన్.ప్రసాద్‌బాబు అధ్యక్షతన విద్యార్థులచే ఉట్టు కొట్టించే కార్యక్రమం నిర్వహించారు. టి.దుర్గాప్రసాద్ బిఎ పొలిటికల్ సైన్స్ విద్యార్థి ఉట్టు కొట్టి రూ.500 నగదు గెలుపొందాడు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ విద్యార్థులకు సాంప్రదాయ క్రీడలపై అవగాహన ఉండాలని సూచించారు. కళాశాలలో అన్ని రకాల సాంప్రదాయ కలలు, క్రీడలు నిర్వహిస్తున్నామన్నారు. చదువుతోపాటు సంతోషాన్ని పంచుకోవాలని, అన్ని సంబరాల్లోనూ విద్యార్థులందరూ కలిసికట్టుగా పాల్గొనాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ బి.శ్రీనివాసరావు, కళాశాల కల్చరల్ క్లబ్ కోఆర్డినేటర్ సిహెచ్.రమాదేవి, సభ్యులు డా.జివి.లాల్, పిఎస్.రావు, వి.హనుమంతరావు, కళాశాల ఫిజికల్ డైరెక్టర్ ఎన్.వినయ్, ఇతర అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కైకలూరు : శ్రీవెంకటేశ్వర స్వామి దేవస్థాన కళ్యాణ మండపంలో నిర్వహించిన శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో ఎంఎల్‌ఎ దూలం నాగేశ్వరరావు, ఎంఎల్‌సి జయమంగళ వెంకటరమణలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ బొప్పన శివప్రసాద్, నాయకులు చేబోయిన వీర్రాజు, జిల్లా వైఎస్‌ఆర్ సేవాదళ్ అధ్యక్షులు బలే నాగరాజు, బూరుబోయిన మోహన్‌రావు, ఆలయ కార్య నిర్వహణ అధికారి శేఖర్, ఆలయ ధర్మకర్త మండలి, శ్రీకృష్ణ ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

30వ తేదీలోగా భూహక్కు పత్రాల పంపిణీకి చర్యలు

ఏలూరు : సెప్టెంబర్ 30వ తేదీలోగా పెండింగ్‌లో ఉన్న భూ హక్కు పత్రాలు పంపిణీ చేసే విధంగా చర్యలు చేపట్టాలని భూపరిపాలన ప్రధాన కార్యదర్శి జి.సాయి ప్రసాద్ అన్ని జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. గురువారం విజయవాడ సిసిఎల్‌ఎ కార్యాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్‌లు, జాయింట్ కలెక్టర్లతో రీ సర్వేకి సంబంధించిన అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా భూ పరిపాలన ప్రధాన కార్యదర్శి జి.సాయి ప్రసాద్ సమీక్ష నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఏలూరు కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి, నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, ఆర్‌డిఒలు, కె.పెంచల కిషోర్, ఝాన్సీరాణి, ఎడి సర్వే వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భూ పరిపాలన ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం భూహక్కు పత్రాల పంపిణీకి సంబంధించి ప్రత్యేక దృష్టి సారించిందని, పెండింగ్‌లో ఉన్న భూహక్కు పత్రాలు పంపిణీ చేసే విధంగా చర్యలు చేపట్టాలని అన్ని జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. కొన్ని జిల్లాల్లో ఆన్‌లైన్ పెండింగ్‌లో ఉన్న కరెక్షన్ ఆఫ్ మాడ్యూల్స్ వెరిఫై చేసే వాటిలో ఎటువంటి తప్పిదాలు లేకుండా ఈనెల 9వ తేదీకి పూర్తి చేయాలని, తదనంతరం పత్రాలను జనరేట్ చేసి, ప్రింటింగ్‌కి పంపించే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. పెండింగ్‌లో ఉన్న స్టోన్ ప్లాంటేషన్ ప్రక్రియ నిర్దేశించిన గడువు లోపు పూర్తి చేయాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ మాట్లాడుతూ ఫేస్-2 కింద పెండింగ్‌లో ఉన్న భూహక్కు పత్రాలు జిల్లాకు రాగానే త్వరితగతిన పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

'ఐఎస్‌ఒ సర్టిఫికెట్ కష్ట సాధ్యం కాదు'

భీమడోలు : దేశంలో ఎక్కడాలేని విధంగా గ్రామపంచాయతీలకు అనుబంధంగా నిర్వహిస్తున్న సచివాలయ వ్యవస్థ మరింత సమర్థవంతంగా పనిచేస్తే మంచి పాలనా ప్రాతిపదికన కేంద్ర ప్రభుత్వం ఇచ్చే 'ఐఎస్‌ఒ 9001' సర్టిఫికెట్ సాధన కష్టం కాదని కేరళ ప్రభుత్వానికి చెందిన కేరళ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లోకల్ అడ్మినిస్ట్రేషన్ కార్యాలయం ప్రతినిధుల బృందం అభిప్రాయపడింది. రాష్ట్రంలోని గ్రామ సచివాలయాలకు మంచి పాలన ప్రాతిపదికన ఐఎస్‌ఒ సర్టిఫికెట్ సాధన కోసం తగు సలహాలు, సూచనలు ఇవ్వాలని కేరళ రాష్ట్ర బృందాన్ని, ప్రతినిధుల త్రిసభ్య బృందాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆహ్వానించింది. సదరు సంస్థకు చెందిన శిరీష, షహీద్, నంబూద్రి సభ్యులుగల బృందం భీమడోలు గ్రామపంచాయతీని, దానికి అనుబంధంగా పనిచేస్తున్న సచివాలయాలను, హెల్త్ క్లినిక్‌లు, రైతు భరోసా కేంద్రాలను గురువారం సాయంత్రం సందర్శించారు. వీరికి పంచాయతీరాజ్ కమిషనరేట్‌కు చెందిన అధికారి బాలాజీతో పాటు, ఏలూరు డిఎల్‌పిఒ ఎన్.చంద్రశేఖర్ వివిధ అంశాలలో సహకరించారు. స్థానిక పరిస్థితుల గురించి గ్రామ సర్పంచి పి.సునీత మాన్సింగ్, గ్రామపంచాయతీ కార్యదర్శి ఎన్.ఠాగూర్ వివిధ విషయాలు, అంశాలను సందర్శనకు వచ్చిన తనిఖీ బృందానికి తెలియజేశారు. అనంతరం వారు గ్రామంలో పర్యటించి పలువురితో మాట్లాడారు. అనంతరం పంచాయతీరాజ్ కమిషనరేట్ అధికారి బాలాజీ మాట్లాడుతూ మంచి పాలనకు ఐఒఎస్ గుర్తింపు వస్తుందన్నారు. తొలి దశలో ఈ తరహా గుర్తింపు కోసం జిల్లాకు రెండు వంతున రాష్ట్రస్థాయిలో 52 గ్రామపంచాయతీలను ప్రభుత్వం పైలెట్ ప్రాజెక్టులుగా గుర్తించిందన్నారు. దీనిలో భాగంగా మన జిల్లాలో భీమడోలు ఒకటిగా గుర్తింపు పొందిందన్నారు. ఆ తర్వాత రాష్ట్ర స్థాయిలోని 13,325 పంచాయతీలలో ఈ సర్టిఫికెట్లు గుర్తింపు కోసం అవసరమైన చర్యలను తీసుకుంటారన్నారు. ఈ కార్యక్రమంలో భీమడోలు గ్రామపంచాయతీల ఇంఛార్జి, విస్తరణ అధికారి ముత్తయ్య పాల్గొన్నారు.

పలు మండలాల్లో నూతన పింఛన్లు పంపిణీ

ఆగిరిపల్లిలో ఫింఛన్లు అందజేస్తున్న ఎంఎల్‌ఎ

ప్రజాశక్తి - ముసునూరు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి ప్రజలందరినీ ఆదుకుంటున్నారని నూజివీడు నియోజకవర్గ ఎంఎల్‌ఎ మేకావెంకట ప్రతాప్ అప్పారావు తెలిపారు. గురువారం మండల కేంద్రమైన ముసునూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ జి.రాణి ఆధ్వర్యంలో నూతన ఫింఛన్లు 285 మందికి అందజేశారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మేకా వెంకట ప్రతాప్ అప్పారావు మాట్లాడుతూ వైఎస్ జగన్మోహన్ రెడ్డి పేద, మధ్యతరగతి, బడుగు, బలహీన వర్గాల వారికి ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అందరినీ ఆదుకుంటున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి సభ్యులు డాక్టర్ ప్రతాప్, ఎంపీపీ రాపర్ల కృష్ణకుమారి, సుబ్బారావు, వైస్ ఎంపీపీ కోటగిరి రాజా నాయనా, వైస్ ఎంపీపీ-2 పాముల గంగాధర్ రావు, మండల పార్టీ అధ్యక్షులు మూల్పూరి నాగవల్లేశ్వరరావు పాల్గొన్నారు.

నూజివీడు రూరల్ : మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో నూతన ఫింఛన్ దారులకు ఎంఎల్‌ఎ మేక వెంకట ప్రతాప్ అప్పారావు చేతుల మీదుగా కొత్త పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలన్నిటినీ నెరవేర్చిన ఏకైక సిఎం జగన్ అని అన్నారు. రాబోయే రోజుల్లో ప్రజలందరూ జగన్ వెంట నడవడం ఖాయమని, ఆయన మరలా సిఎం అవుతారని ఎంఎల్‌ఎ అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు, వైసిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి : ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటిని అమలుపర్చుచున్న ఏకైక ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి అని నూజివీడు నియోజకవర్గ ఎంఎల్‌ఎ మేకా వెంకటప్రతాప్ అప్పారావు అన్నారు. గురువారం ఆగిరిపల్లిలో నూతనంగా మంజూరైన 501 ఫింఛన్లను ఆయన ఆయా గ్రామ సర్పంచిలతో కలిసి అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి పి.వీరబాబు, ఎంపీపీ జి.అనూష, మండలపార్టీ అధ్యక్షులు పి.నరశింహారావు, వైసిపి జిల్లా కార్యదర్శి ఎం.హరిబాబు, జిల్లా ఉపాధ్యక్షురాలు పావనజ్యోతికుమారి, ఎంపిడిఒ పి.శంకరరావు, పలు గ్రామాల సర్పంచిలు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

చాట్రాయి : వైఎస్‌ఆర్ 371 కొత్త ఫింఛన్లను చాట్రాయి మండల పరిషత్తు అభివృద్ధి కార్యాలయంలో గురువారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నూజివీడు నియోజకవర్గ ఎంఎల్‌ఎ మేక వెంకటప్రతాప్ అప్పారావు విచ్చేశారు. ఈ కార్యక్రమం ఎంపిడిఒ కె.దుర్గాప్రసాద్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహకార కోపరేటివ్ యూనియన్ ఛైర్మన్ దేశి రెడ్డి రాఘవరెడ్డి, ఎంపీపీ లంక నిర్మల, గ్రామ సర్పంచి దామెర.ఉష, తహాశీల్దార్ సిహెచ్.విశ్వనాథరావు పాల్గొన్నారు.

ఎస్‌సి, ఎస్‌టిలకు న్యాయం చేయాలి : ఎంఎల్‌ఎ

ఏలూరు టౌన్ : సమాజంలో ఎస్‌సి, ఎస్‌టిలకు ఏ రూపంలో అన్యాయం జరిగినా వారి పక్షాన నిజాయితీగా నిలబడాలని, తగిన న్యాయం జరిగేలా చూడాలని మాజీ డిప్యూటీ సిఎం, ఎంఎల్‌ఎ ఆళ్ల కాళీకృష్ణ ప్రసాద్ (నాని) తెలిపారు. జిల్లా ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ మెంబర్‌గా ఎన్నికైన తోకల రాజేష్ బాబుకు గురువారం ఎంఎల్‌ఎ ఆళ్లనాని ఆర్డర్ కాపీ అందించారు. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ నిజాయితీగా దళితులకు సేవ చేయాలని హితవు పలికారు. సేవ చేయడం ద్వారా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఆశయాలు నెరవేర్చాలని, పదవులకు వన్నె తేవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ నూకపెయ్యి సుదీర్ బాబు, మునిసిపల్ కోఆప్షన్ మెంబర్ ఎస్‌ఎంఆర్ పెదబాబు, మంచెం మైబాబు, మేతర సురేష్, బండారు కిరణ్, తిప్పాని రామ్మోహన్ పాల్గొన్నారు.

నేడు తిరుపతిలో బహిరంగసభ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

సిపిఐ ఆంధ్రరాష్ట్ర సమితి నిర్వహించిన 'రాష్ట్రాన్ని రక్షించండి - దేశాన్ని కాపాడండి' బస్సుయాత్ర ముగింపు సందర్భంగా ఈనెల 8న శుక్రవారం తిరుపతిలో జరుగు బహిరంగ సభకు జిల్లా నుంచి సిపిఐ, ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలి వెళ్తున్నారని సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

స్థానికులకే ఎంఎల్‌ఎ సీటు ఇవ్వాలి : టిడిపి

జంగారెడ్డిగూడెం : చింతలపూడి నియోజకవర్గంలో స్థానిక అభ్యర్థులకే ఎంఎల్‌ఎ సీటు ఇవ్వాలని టిడిపి నాయకులు కోరుతున్నారు. గురువారం రూరల్ ఎస్‌సి సెల్ మండల అధ్యక్షులు గొల్లమందల శ్రీనివాసరావు అధ్యక్షతన జిల్లా తెలుగుయువత కార్యదర్శి బొకినాల వాసు ఆధ్వర్యంలో లోకల్ అభ్యర్థి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి బొబ్బర రాజ్‌పాల్, మండల ఎస్‌సి సెల్ అధ్యక్షులు గొల్లమందల శ్రీనివాసరావులు మాట్లాడుతూ ఎట్టి పరిస్థితుల్లో చింతలపూడి నియోజకవర్గంలో లోకల్ వ్యక్తినే ఎంఎల్‌ఎ అభ్యర్థిగా ఖరారు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గ అధ్యక్షులు బోడ అనీష్ కుమార్, నియోజకవర్గ ఎస్‌సి సెల్ అధ్యక్షులు పల్లి శ్రీను, నాయకులు మారుమూడి థామస్, గద్దె శివ, కోటేశ్వరరావు, నాగరాటాలు, కందుల కేశవరావు, కే.కోట, ఆర్గనైజింగ్ సెక్రటరీ బొబ్బిలి డాన్ దివాకర్ పాల్గొన్నారు.

CHANGE OF NAME

I undersigned **KAVURU NARSAMMA (Old Name) W/o. Gubbala Ashok Kumar,** D.No.1-74 Modi, L.B.cherla Village, Narsapur, West Godavari District. Changing My Name from **KAVURU NARSAMMA (Old Name) to GUBBALA LAKSHMI KEERTHANA (New Name)** shall hence forth iam being called as **GUBBALA LAKSHMI KEERTHANA (New Name)** for all purposes.

CHANGE OF NAME

I undersigned **MASABATTULA SNEHA NAVEEN (Old Name) S/o. Masabattula Satyanarayana,** D.No.12-71/A Salipeta, Undi Post, West Godavari District-534199. Changing My Name from **MASABATTULA SNEHA NAVEEN (Old Name) to S NAVEEN KUMAR MASABATTULA (New Name)** shall hence forth iam being called as **S NAVEEN KUMAR MASABATTULA (New Name)** for all purposes.

పాస్‌పోర్టు పోయినది

ఏలూరు జిల్లా, పోలవరం మండలం, ప్రగడపల్లి గ్రామ అయిన చాపల సీత అను నేను పోలవరం జిరాక్స్ షాపు నుండి మా ఊరు ప్రగడపల్లి వెళ్తుండగా మార్గమధ్యలో నా పాస్‌పోర్టు పోయినది. నా పాస్‌పోర్టు నెంబర్ **P9990000** కనుక ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది అడ్రసుకు తెలియజేయగలరని కోరుచున్నాను.

చాపల సీత
భర్త: పోసి బాబు, ఇంటి నెంబర్ 1-121,
సుబ్రహ్మణ్య స్వామి గుడి వీధి, ప్రగడపల్లి,
పోలవరం మండలం, ఏలూరు జిల్లా,
పిన్ కోడ్: 534318.
సెల్: 77022 28289

ప్రకటన
మహారాజశ్రీ భీమవరం 3వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టు, ప.గో. జిల్లా
M.V.O.P.No. 7 /2023
బిట్వీన్:
మానేపల్లి ప్రభాకర్‌రావు, rep.by మానేపల్లి మురళీకృష్ణ & అదర్స్.... పిటీషనర్
జంపిన శివ గణేష్ .... రెస్పాండెంట్స్
టు : ఆర్-1 :
జంపిన శివ గణేష్, s/o. వెంకటేశ్వరరావు,
నివాసం : 2-61, ఆర్. పంగిడి గ్రామం,
ద్వారకాతిరుమల మండలం, ప.గో. జిల్లా
డ్రైవర్ ఆఫ్ కార్ నెం. AP39BJ1236
- - -
మీరు పై తెలిపిన ఎం.వి.ఓ.పి.నెం.7/2023 లో పై తెలిపిన 1వ ప్రతివాది అయివున్నారు. మీకు ఎన్నిసార్లు సమన్లు పంపినను తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. పై తెలిపిన 3వ భీమవరం అదనపు జిల్లా వారి కోర్టు వారి యొక్క ఉత్తర్వు ప్రకారం మీరు సెప్టెంబరు నెల 22 తేదీ 2023వ సం.రం. ఉదయం గం.10-30ని.లకు హాజరు కావలెను. లేని యెడల సదరు విషయమై మీకు పరోక్షముగా విచారించి తీర్మానము చేయుదురని ఇందు మూలముగా తెలియ జేయడమైనది.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదా తేది : 22-09-2023
నిమ్మల వీర వెంకట సత్యనారాయణ
సెల్: 98482 13165,
నిమ్మల నవీన్, సెల్: 8978122722
అడ్వకేట్స్, భీమవరం